

# కథా కౌముది

## వీసా – మహేష్ శనగల Municie, IN

*వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన 16వ ఉగాది ఉత్తమ రచనల పోటీలో*

*- ఉత్తమ కథానిక విభాగంలో - బహుమతి పొందిన కథ*

**యాభై ఏళ్ళ పాటు శతవిధ హావభావాలు** పలికించిన చేతులలో, ఆ వర్షం కురిసిన సాయంత్రం, రెపరెపలాడింది ఒక కాగితం. అది మామూలు కాగితం కాదు. ఆహార్యం లేని కబీర్ దాస్ ముఖకవళికలలో ఆశ్చర్యం తొణికిసలాడింది. వరండాలో కూర్చుని, తన బంగారు కళ్ళజోడుతో మరొక్కసారి ఆ కాగితం వంక నిశితంగా చూశాడు. వీసా వచ్చింది తనకి. అనుకుని అతిధిలా, ఆశ్చర్యభరితంగా, వచ్చిందా వీసా. ఏ దేశానికి వీసా అన్నది అందులో రాసిలేదు. కొందరికి ఎంతో కష్టపడితేనో, ఎన్నో ఇక్కట్ల పాలైతెనో, సంవత్సరాలు పడిగాపులు కాస్తేనో రాని వీసా తనకి ఇంత త్వరగా హృదయ భరితంగా ఇప్పుడెలా వచ్చిందన్న ఆలోచనలలో మునిగిపోయాడు కబీర్ దాసు.

బయట వాహనాల రొద, లోపల ఆలోచనల సొదల మధ్య ఒక్క క్షణం తన జీవితాన్ని ఒకసారి పునరావలోకనం చేసుకున్నాడు.

సచిన్ టెండూల్కర్ కంటే ఒక అరంగుళం తక్కువగా ఉన్నా, అతనికి తక్కువకాని పట్టుదల, ప్రేరణ, క్రమశిక్షణలతో తన జీవితాన్ని నటరాజుకి అంకితం చేసాడు కబీర్ దాసు, ఐదుం పావు అడుగుల స్థూలకాయంలో ఐదువందల అడుగుల గిరజాల జులపాల హాస్యనటుడు, తండ్రి, కొడుకు, భర్త, అన్న, ఇంకా మరెన్నో పాత్రల కామ రూపాలు దాగి ఉన్నాయి. జులాయిగా తిరగాల్సిన టీనేజ్ వయసులో మొదలెట్టిన నాటకాల పిచ్చి తననీ ఉన్నత స్థితికి తీసుకు వచ్చింది. చార్లీ చాప్లిన్, చో రామస్వామి తన ఆరాధ్యదైవాలు. రిటైరైన గత దశాబ్దంలో అయిన నటజీవితం మరింత ఎత్తుకి, తారాస్థాయికి చేరుకుని ఉంది. ఎన్నో అనూహ్యామైన నాటకీయత ఉన్న నాటకాలేసిన కబీర్ దాసుకి ఇలా ఉన్నట్టుండి అంతకంటే ఎక్కువ నాటకీయంగా వీసా రావడం ఇంకా అర్ధం కావడంలేదు. తను పుట్టీ పుట్టడంతో అందరిలాగే ఈ దేశానికి ఆరు దశాబ్దాల క్రితం వలస వచ్చినప్పుడు వీసాకి దరఖాస్తు పడింది. తను నటించే సినిమాలు, సీరియళ్ళ కంటే నిత్యజీవితంలోనే ఊహించలేని నాటకీయత ఉందన్న సంగతి కబీర్ దాసుకి చిన్నప్పుడే అర్ధమయ్యింది. నెలకి తొంభై

రూపాయిల జీతం మీద ఏడుగురు బ్రతికిన రోజుల నుండి, కోట్లకి పడగలెత్తిన ఈ రోజు వరకు జీవితం ఊహించలేనన్ని మలుపులు తిరిగాయి.

ఆశ్చర్యాలోచనల నుండి బయట పడి, పక్కనే కూచుని టీవీ చూస్తున్న తన ఆరడుగుల బామ్మర్దిని పిలిచి అడిగాడు కబీర్ దాసు.

"ఏమయ్యా రాఘువరావూ, ఇది నిజంగా వీసానే అంటావా? నమ్మశక్యం కావడంలేదయ్యా. ప్రతి ఏడూ వీసా ఆఫీసరుని ఠంచనుగా కనుక్కున్నప్పుడు ఏనాడు ఇంత త్వరగా వీసా వస్తుందని చెప్పలేదు. ఒకవేళ ఇదేమయినా స్కాము కాదు కదా?" అని ఒకింత అనుమానం వ్యక్తం చేశాడు.

"వాన రావడం, వీసా దొరకడం రెండూ చెప్పలేని విషయాలు. ఏదైనా ఒకసారి మనం నిర్ధారించుకుంటేనే మేలు బావగారూ. ఒకసారి వీసా ఆఫీసుకు వెళ్ళి వద్దాం పదండి" అని రాఘువగారు ఇరవై నాలుగ్గంటల విజయవాడ వీసా ఆఫీసుకి దారి తీశాడు.

ఆదివారం కావడంతో రోడ్డు మీద ట్రాఫిక్కు సెలైను బాటిల్ నుండి కారుతున్న నీటి చుక్కల్లా పారుతోంది. మేఘాలు దట్టంగా, పాత అట్లకాడ మీద పేరుకుపోయిన మష్టులా కావరించి చూస్తున్నాయి. ఏ నిమిషంలో నైనా చినుకులు చిలికి చిలికి పెద్ద గాలివానలా మారే సూచనలు కనిపిస్తున్నాయి.

ఆదివారమైనా చాంతాడంత క్యూ ఉంది. ఆఫీసులో ఒక మధ్య వయస్కుడైన సగటు గుమస్తా ఉన్నాడు. ఒక అరగంట తర్వాత తన వంతు వచ్చింది.

వీసాలు రావడం సర్వసాధారణం అయ్యింది చాలా కాలంగా. ఒకానొకప్పుడు, అంటే మార్కండేయుడి కాలంలో వీసాలు రాని, అవసరంలేని రోజుల్లో, ఈ ఇహదేశంలో జీవితం బోరు కొట్టి పరదేశంలో కాలం గడపాలనుకునే వాళ్ళకి మాత్రం వీసా అవసరం అయ్యేది. ఈ రోజుల్లో అందరికి ఎప్పుడో ఒకప్పుడు వీసాలు వస్తూనే ఉన్నాయి.

"ఇది మీరు అరవయ్యారేళ్ళ క్రితం దాఖలు చేసిన వీసా దరఖాస్తు. కానీ ఇందులో మీకు వీసా వచ్చినట్టుగా ఏమీ వివరాలు కనిపించడంలేదు" అని పెదవి విరిచాడు గుమస్తా వీరయ్య. "అయినా మా ఆఫీసరుతో ఒకసారి మాట్లాడి చెబుతా ఉండండి" అని పక్కనే ఉన్న  గదిలోకి వెళ్ళాడు వీరయ్య. అవతల ఆఫీసరు చెప్పే మాటలే గట్టిగా వినిపిస్తున్నాయి. మాటలు వింటూనే వీరయ్య వాలకం మారిపోయింది. "సారు వెంటనే వస్తున్నారు."

లోపలకి వస్తూనే వినమ్రంగా నమస్కారం చేసి "మిమ్మల్ని ఇంతసేపు వేచి ఉంచాను, క్షమించాలి సార్." అని చెయ్యి కలిపి మరో కుర్చీ లాక్కుని కూర్చున్నాడు ఆఫీసర్. "నాపేరు నారాయణ, మీ అభిమానిని. ఎన్నోసార్లు మీ నాటకాలు, సినిమాలు చూశాను, చాలా ఎంజాయ్ చేశాను. మీరంటే గౌరవం, అభిమానం."

"అవునా!" అని నవ్వుతూ తలూపాడు కబీర్ దాసు.

కొంత పిచ్చాపాటి మాట్లాడిన తర్వాత విషయంలోకి వచ్చాడు నారాయణ.

"విషయమేమిటంటే మీకు ప్రత్యేకమైన వీసా వచ్చింది. మీ ఫైల్స్ నా దగ్గర ఉన్నాయి. నేను రేపే మీకు పర్సనల్‌గా ఫోన్ చేద్దామనుకుంటున్నాను. ఈ లోగానే మీకు కొరియర్లో ఉత్తరం అందుతుందని అనుకోలేదు."

ఇంకా విషయం అర్థంకానట్టుగా ముఖం పెట్టాడు కబీర్ దాసు

"ఎక్స్‌ట్రార్డనరీ ఎబిలిటీ ప్రోగ్రాములో ఒక్కొక్కసారి ప్రత్యేకమైన వ్యక్తులకి వీసాలు అనాయాసంగా వస్తాయి." తన వడిలో ఉన్న ఫైల్ బల్ల మీద పెట్టి ముడి విప్పాడు నారాయణ. "మీ పేరు ఆ కోటాలోకి వెళ్ళింది. నూటికో కోటికో ఒకరికి దొరికే వీసా ఇది. కాకపోతే మీరు ప్రయాణం కొన్ని ప్రత్యేక పద్ధతుల్లో చెయ్యాలి."

"అలాగా. చెప్పండి" అన్నాడు కబీర్ దాసు. ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న పనులు, జీవితం, జీవన విధానం వదిలి వలస పోవడం ఎలా? అదీ ఇంత అర్జంటుగా? ఈ ఊహలు బస్తాండులో ఈగల్లా కబీర్ దాసు బుర్రలో తిరుగుతున్నాయి.

"మొదటగా, ఈ వీసాని మీరు తిరస్కరించడం కుదరదు. కనీసం ఒక సంవత్సరం క్రిందటే మీరు తిరస్కార దరఖాస్తు చేసి ఉంటేగాని కుదరదు."

ఒక్కసారి ఫ్రాంజా కాఫ్కా, జాన్ పాల్ సార్త్రే, బోర్హే, వగైరే రచయితల అస్థిత్వ వాద, అధివాస్తవిక వాద రచనలు తన కళ్ళముందు గిర్రున తిరిగాయి.

"ప్రతి సంవత్సరం వీసా లాటరీలో నా పేరు వస్తుందేమోనని కనుక్కున్నప్పుడు కూడా ఇలాంటి విషయం బయట పడలేదు సార్. ఎంత సంతోషదాయకమైన విషయమైనా ఇంత అర్థాంతరంగా వస్తే కొంచెం కష్టమే కదా?"

"అవున్సార్. కానీ ఇది లాటరీ కాదు. ప్రత్యేకమైన వ్యక్తులకి ప్రత్యేకమైన కేటగిరీ ఇది. వస్తే అనాయాసంగా, అనాయాచితంగా వస్తుంది. ఇది ఈ అదృష్టం" అన్నాడు నారాయణ.

"కేవలం మీ కుమారుడు మాత్రమే మీతో కూడా విమానాశ్రయానికి వెళ్ళి, ప్రత్యేకమైన కాగితాల మీద సంతకాలు పెట్టి మిమ్మల్ని విమానం ఎక్కించవలసి వస్తుంది. ఇది రెండో రూలు."

"కానీ మా అబ్బాయి అమెరికాలో ఉంటాడు." కొంచెం ముఖం చిట్లించి అడిగాడు కబీర్.

"ఫరవాలేదు. ఆయనని పిలిపించండి వీలైనంత త్వరలో" అదేదో సర్వ సాధారణమైన విషయంగా చెప్పాడు నారాయణ.

"తర్వాత ఈ వీసాతో మీరు కేవలం కొన్ని విమానాశ్రయాల గుండా మాత్రమే వెళ్ళగలరు." కాగితాలు తిప్పి, ఒక చిట్టాతీశాడు నారాయణ. మన రాష్ట్రంలో విజయవాడ, రాజమండ్రి. కానీ మీకు మరింత సుఖప్రయాణం కావాలంటే, వారణాసి లేదా అలహాబాద్ విమానాశ్రయాల ద్వారా వెళ్ళాల్సి ఉంటుంది. ఇవి గవర్నమెంటు వారి రూల్సు. మీకు ఉన్నత తరగతి టిక్కెట్లు అక్కడినుండి మాత్రమే లభిస్తాయి. మిగిలిన చోట్ల జనరల్ లేదా రెండవ క్లాసు టిక్కెట్లు మాత్రం ఉంటాయి."

అర్థమైనట్లు తలూపాడు కబీర్ దాస్.

"ఇది సింగిల్ ఎంట్రీ వీసా. కేవలం ఒక్కసారి వెళ్ళడానికే పనిచేస్తుంది. మరల వాపసు రావడానికి దరఖాస్తులు చేసుకోవడానికి మరొక జీవితకాలం పడుతుంది." కాస్త అతిశయోక్తితో చెప్పాడు నారాయణ.

"మీరు బయలుదేరడానికి కేవలం పదకొండు రోజులు మాత్రం ఉన్నాయి, ఈ రోజు కలుపుకుని. ఇది ప్రత్యేకమైన రూలు. ఇలా కుదరకపోతే మీ ప్రయాణం లో అష్టకష్టాలు, చెప్పలేనన్ని బాధలు పడాల్సి వస్తుంది అని గరుడ ఉవాచ. కాబట్టి మీ ప్రయాణ ఏర్పాట్లు వెంటనే చేసుకోండి." అని ఫైల్ మూశాడు నారాయణ.

ఇక వెనుతిరిగి చూసుకునే అవకాశం, అవసరం కనిపించలేదు కబీర్ దాసుకి. ఈ దేశంలో మూడు జీవితకాలాల సమానంగా ఘనమైన జీవితం గడిపాడు కబీర్ దాసు. ఇక ఈ వీసాతో మరొక విన్నూత్నమైన జీవితాన్ని మొదలుపెట్టే అవకాశం లభించింది. మరొక రంగస్థలం పైన మరిన్ని విలక్షణమైన వేషాలు వేసే సమయం ఆసన్నమైంది.

"ఇక ప్రయాణ సన్నాహాలు మొదలెడదాం పదండి బావగారూ" అన్నాడు రాఘవరావు.

"చాలా థాంక్స్, మరి బయలుదేరతాం" అని నారాయణతో చెయ్యి కలిపాడు కబీర్ దాస్.

వీరయ్యకి వద్దన్నా ఒక ఐదొందలు చేతిలో పెట్టి నిష్క్రమించాడు కబీర్ దాసు.

విమానాశ్రయం

రెండురోజులపాటు ఏక బిగిన ప్రయాణం చేసి వారణాసిలో రైలు దిగారు కబీర్ దాస్, కొడుకు ఈశ్వరదాసు.

ఈశ్వర్ మనసు భారంగా ఉంది. అనుకోకుండా నాన్నగారికి వీసా రావడంతో వెంటనే వచ్చేసాడు. నలభైయ్యేళ్ళ ఈశ్వర్ గత ఇరవయ్యేళ్ళుగా అమెరికాలో ఉంటూ ఇప్పుడు పెద్ద పరిశోధనా సంస్థని నడుపుతున్నాడు. తనకి కాశీ నగరం రావడం ఇది మొదటిసారి కాదు. క్రితం సారి కాశీకి వచ్చినప్పుడు తను ఆ నగరంపై, కాశీ పురాణంపై పరిశోధనలు చేస్తున్నాడు. కాశీని మించిన అద్భుతం ఈ ప్రపంచంలో మరెక్కడా లేదని ఆధార పూర్వకంగా ఋజువు చేశాడు తన పరిశోధనా వ్యాసాల ద్వారా. కానీ మలిసారి వచ్చేది నాన్నగారిని విమానం ఎక్కించడానికి అని, అదీ ఇంత త్వరలో అని ఏనాడూ అనుకోలేదు.

సూర్యోదయంతోనే లేచి, నాన్నగారిని చేత వెంట పెట్టుకుని విమానాశ్రయానికి బయలుదేరాడు ఈశ్వర్. ఐదువేల సంవత్సరాల చరిత్ర ఉన్న ఆ విమానాశ్రయం అత్యద్భుతం, అసమానం, అత్యంత పవిత్రం, శక్తివంతం. ప్రపంచంలో మరెక్కడా అటువంటి బృహత్తరమైన ప్రదేశం లేదనేది పరమసత్యం. కేవలం కాశీలో మాత్రమే ఉత్తర దిశగా పారే గంగమ్మ ఒడ్డున, అర్ధచంద్రాకారంలో ఏడు కిలోమీటర్ల పొడువు ఉంటుందా విమానాశ్రయం. ఈ విమానాశ్రయానికి అరవై నాలుగుగేట్లు ఉన్నాయని తనకి అనుభవ పూర్వకంగా తెలుసు. కాశీలో వీధులన్నీ తన అరచేతి రేఖల్లాగా ఈశ్వర్ మస్తిష్కంలో నిక్షిప్తమై ఉన్నాయి.

"ప్రపంచంలో ఇతర ఎయిర్ పోర్టులు గేట్లు అని అంటే వారణాసి పరిభాషలో వాటిని ఘాట్లు అని పిలుస్తారు నాన్నగారు," అని యధాలాపంగా నాన్న వైపు తిరిగి చెప్పాడు ఈశ్వర్. కాశికి రావడం కబీర్ దాసుకి ఇదే మొదటిసారి. అనేక సార్లు రావాలనుకున్నా ఆఖరికి వీసా వచ్చాక రావడం అనేది కబీర్ దాసుకి జగన్నాటకంలో మరో అనూహ్యమైన మలుపుగా తోచింది.

విమానాశ్రయానికి దారి తీసే దశ అశ్వమేధ వీధి అసాంతం కిటకిటలాడుతుంది. ఆట సామాన్లు అమ్ముతున్న చిరువ్యాపారులు, తోపుడు బళ్ళు, విరిగిపోయిన చిన్ని నీటి విమానాలు, వాటి తెడ్లు, పక్కన ఒక షాపు అరుగుపై నిద్రపోతున్న ప్రయాణీకులు, రాత్రి గంగమ్మ హారతి తర్వాత పడవేసిన పూలు, మరింత చెత్త, మరో పది అడుగుల్లో రౌద్ర హనుమాన్ మందిరం, ప్రక్కనే గణేశ ఆలయం కుడివైపున రెండు ధర్మ సత్రాలు, గన్నులు, లాఠీలతో వందమంది సెక్యూరిటీ గార్డులు, ఇవీ ఆ విమానాశ్రయానికి నిత్య స్వాగత దృశ్యాలు...

విమానాశ్రయానికి ప్రధాన గేటు దశ అశ్వమేధా గేటు. అప్పటి వరకు ఇరుకు దారుల్లో నడచిన వారిద్దరికి గేటు దగ్గరికి వచ్చిన మరుక్షణం ఎదురుగా విశాలంగా నీటిరంగుల చిత్రంలా కనిపించింది గంగా రన్ వే. ఇది ప్రపంచంలో అత్యంత పురాతనమైన, ముఖ్యమైన విమానాశ్రయమున్న విషయం కళ్ళకి కట్టినట్టుగా కనిపిస్తుంది.

ఆ రన్‌వేకి ఆవలి ఒడ్డున గీత గీసినట్లున్న క్షితిజ రేఖ మీదుగా ఎర్రటి సూర్యుడు ఉదయిస్తూ దర్శనమిచ్చాడు! ఆ బృహదృశ్యం చూసి ఒక్క క్షణం తన్మయత్వంతో ఆగిపోయారు తండ్రీకొడుకులు.

రన్‌వే మీద వందల కొద్దీ నీటి విమానాలు నిలిచి ఉన్నాయి. కొన్ని గేట్ల వద్ద మెట్లకి ఉన్నాయి, కొన్ని బయల్దేరుతున్నాయి, మరి కొన్ని అప్పుడే తిరిగి వచ్చి ఉన్నాయి. వర్షాకాలం కావడంతో రన్‌వే మరింత విశాలంగా మారింది. దానిపై బంతి, చామంతి, మల్లెపూలు, విస్తళ్ళు, మరింత చెత్తచెదారం తేలుతున్నాయి. వరదల్లో కొట్టుకు వచ్చిన బురదతో రన్ వే ఛాయలో, బెల్లం పాకంలా కనిపిస్తుంది.

మరో నాలుగడుగులు వేసి గేటు మెట్లపైకి అడుగుపెట్టారు తండ్రీ కొడుకులు. మరుక్షణం వాళ్ళని చుట్టుముట్టారు ఒక డజనుమంది ట్రావెల్ ఏజెంట్లు. ప్రతి ఏజెంట్ ఒక టైం టేబుల్ చంకలో ఉంచుకుని, చేతిలో ప్రయాణ ద్రవ్యాలతో మేమంటే మేము అని పోటీపడుతున్నారు.

ఇవేమీ పట్టించుకోకుండా, ఈశ్వర్ దాసు నాన్న చెయ్యిపట్టుకుని ముందుకు వెళ్ళాడు. గతకుల, ఊగిసలాడుతున్న మెట్లు దిగి కుడివైపుకి తిరిగి నారద గేటువైపుకి నడిచాడు. పట్టుమని పదేళ్ళు కూడా లేని పిల్లలు రన్‌వే మీదకి దూకుతున్నారు. మరో వైపు యోగాసనాలు వేస్తూ కొందరు, కాషాయ వస్త్రాలలో రుద్రాక్ష మాలలు తిప్పుతూ కొందరు, దంతావధానం చేస్తూ కొందరు కుస్తీలు వ్యాయామాలు చేస్తూ మరికొందరు వారి పనులు వారు చేసుకుంటున్నారు. ఆ పైన కొందరు చాకలి వాళ్ళు రోజువారీ బట్టలు ఉతికి గేట్ల ప్రక్కన ఆరవేస్తున్నారు. వెనక మణికర్ణికా గేటులో ఇప్పుడే వీసా వచ్చిన కొందరిని ధూప నైవేద్యాలతో సాగనంపుతున్నారు కుటుంబసభ్యులు, ట్రావెల్ ఏజెంట్లు. ఇటువంటి అధివాస్తవిక దృశ్యాలు మరే విమానాశ్రయంలోనూ చూడలేదు కబీర్‌దాసు. ఇవేమీ కొత్తకానట్టు ముందుకు అడుగులు వేశాడు ఈశ్వర్ దాసు.

నారద గేటు ఒక చిన్న ప్రదేశం. రాజా గేటుకి కొద్ది ముందు, కేదార్ గేటుకి ఇవతల, ఒక క్లుప్తమైన వాక్యంలా ఉంది. జాగ్రత్తగా, కదులుతున్న రాళ్ళ మెట్ల మీద అడుగులు వేస్తూ, కబీర్ దాసుకి చేయూతనిస్తూ గేటు ఏజెంట్ దగ్గరకి చేరాడు ఈశ్వర్ దాసు.

ఏజెంటు నటరాజు శాస్త్రి తను చేస్తున్న ఏర్పాట్లు ఒకసారి ఆపి ఇటుగా చూశాడు. చేతులు జోడించి నమస్కరించాడు ఈశ్వర్ దాసు.

"మా నాన్నగారికి వీసా లభించింది. ఇది వారి ప్రయాణ పత్రం, ఇవి వారి లగేజ్. ఈయన మా నాన్నగారు. నేను మొన్న మీతో ఫోనులో మాట్లాడాను కదా."

"అవును, రండి, ఈ మెట్లపై కూర్చోండి, మీ లగేజ్ ఇటు పెట్టండి."

ఈలోగా ఎన్నో అనౌన్సుమెంట్లు జరుగుతున్నాయి. వెళ్ళే నీటి విమానాలు, వచ్చేవి, ప్రయాణీకుల, కుటుంబ సభ్యుల సంభాషణలు, సంధ్యావందనం చేస్తున్న ట్రావెల్ ఏజెంట్లు, చిలకల కిలకిలలు, కోతుల కలకలం, వెరసి ఆ విమానాశ్రయం కళకళలాడుతోంది. గరుత్మంతుడు స్థాపించిన విమాన సంస్థ అనాదిగా ఇక్కడ సేవలందిస్తోంది.

"మీరిక్కడ, మీ నాన్నగారిక్కడ కూర్చోండి. ఆ లగేజ్ ఇక్కడ చెకిన్ చెయ్యండి." అని సూచనలిస్తూ, తన పంచె సరిచేసుకున్నాడు నటరాజ శాస్త్రి.

కబీర్‌దాసు ముఖం ప్రశాంతంగా ఉంది. కానీ ఈశ్వర్ దాసు చేతులు వణుకుతున్నాయి, పాదాలు నిలిచి పోయి ఉన్నాయి, ముఖంలో ఆవేదన, దుఃఖం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి. కళ్ళు శ్రీశైలం ఆనకట్టలా, కురవబోయే బరువైన నల్లని మేఘాల్లా ఉన్నాయి, హఠాత్తుగా నాన్నగారు వీసా తీసుకుని పర దేశానికి ఇంత త్వరగా వెళ్ళవలసి రావడం చాలా నాటకీయంగా అనిపించింది. జన్మనిచ్చిన తండ్రిని మరో జన్మవరకు చూడలేననే బాధ. తను సిద్ధంగా లేడు. ఋణానుబంధం ఇంకా తీరలేదు. అయినా తప్పదు. ఆ వీసాకి ఉన్న బలం, అధికారం అలాంటిది. ఈ ప్రవాహం గంగా ప్రవాహంలా సాగిపోవాల్సిందే

వేద మంత్రాలు, గరుడ పురాణంలో ప్రయాణ ప్రస్తావనలు, వెళ్ళేదారిలో ఎదుర్కొనే అనుభవాలు, ఇంతకు ముందు వెళ్ళిన పూర్వీకుల వివరాలు, ఈ విమానాశ్రయం ప్రాశస్త్యం, అత్యంత భక్తివంతంగా వల్లిస్తున్నాడు నటరాజ శాస్త్రి. శ్రద్ధగా వింటున్నారు తండ్రీ కొడుకులు. రీముల కొద్దీ పేపర్ల పైన దుర్భల కుంచెతో సంతకాలు చేస్తున్నాడు ఈశ్వర్ దాసు.

ఇక ప్రయాణ సమయం ఆసన్నమైంది. మైక్‌లో ప్రకటనకూ ఇచ్చారు.

"నా గురించి ఇక బాధపడవలసిన అవసరం లేదు బాబూ. నేనెక్కడికి వెళ్ళినా నీతోనే నీలోనే ఉంటాను. ఇంత సులభంగా వీసా లభించటం, ఇంత మహోన్నతమైన విమానాశ్రయం నుండి మొదటి తరగతిలో ఈ మహా ప్రవాసం కావించడం నా అదృష్టం నాన్నా." అని ప్రేమతో ఈశ్వర్ తల నిమిరి గాఢ ఆలింగనం చేశాడు కబీర్‌దాస్.

ఈశ్వర్ దాసు నోట మాట రావడంలేదు. కళ్ళవెంబడి నీళ్ళు జలపాతాలై, వరద గంగలో కలుస్తున్నాయి. అసలు విషయం నమ్మ శక్యం కావడంలేదు. ప్రతి కొడుకుకి తన నాన్న సూపర్ మాన్‌లాగా, కాలాతీతుడిగా, విధినే శాసించే విధాతగా, కనిపిస్తాడు. ఎప్పటికీ తనకోసం అలానే ఉంటాడని అనుకుంటాడు. కానీ ఎప్పుడో ఒకప్పుడు తనని వదిలి వెళ్ళిపోతాడనే ఊహ కూడా కొడుకు దగ్గరికి రాకపోవచ్చు.

తనకి పాలు పట్టి లాలించి, తన వేలిని పట్టి నడిపించి, తన పేరుని చెవిన ఊది, తన చెయ్యి పట్టి అక్షరాలు దిద్దించి, తను పెట్టిన కష్టాలన్నీ భరించి, ఓరిమితో క్షమించి ఇంత వాడిని చేసిన తండ్రిని దూరదేశాలకి పంపడం మనసుని కలిచి వేస్తుంది.

ఆప్యాయతతో నటరాజ శాస్త్రి ఈశ్వర్ దాసు భుజంపై తట్టాడు. "ఇక సమయం ఆసన్నమైంది బాబూ."

అవునన్నట్టుగా, అయిష్టంగా తల ఊపి నాన్నగారి చేతిని తన చేతిలోకి తీసుకుని పడవలోకి ఎక్కాడు.

నారాయణ మంత్రం జపిస్తూ ధ్యానముద్రలో కూర్చున్నాడు.

పడవ నది మధ్యలోకి వెళ్ళింది.

ఒకవైపు సనాతనమైన కాశీ నగర హర్మ్యాలు, మరో వైపు నిర్మలమైన శూన్యం. పైన రవి కిరణాలలో తడిసిన నీలి గగనం, క్రింద పింగళ వర్ణంలో గంభీరంగా అనాదిగా పాప సహస్రాన్ని ప్రక్షాళనం చేసే గంగా ప్రవాహం.

నారాయణ మంత్రంతో నాన్నగారికి కంటి గంగతో వీడ్కోలు చెప్పాడు. అనంత, పవిత్ర, ఆధ్యాత్మిక రంగస్థలంలో వీడ్కోలు చెప్పాడు.

భగీరథుడు గంగను నింగి నుండి నేలపైకి తెస్తే, కబీర్ దాస్ నేలపై నుండి నింగిలోనికి నట గంగను తీసుకువెళ్ళాడు. మరిన్ని నాటకాలు వెయ్యడానికి, నవ్వులు పండించడానికి, సంతృప్తిగా ఉన్నతలోకాల మహోన్నత రంగస్థలానికి తరలి అపర నట భగీరథుడిగా ప్రత్యేక విమానంలో వెళ్ళాడు కబీర్‌దాసు.

●●●

**Click here to share your comments on this story**